www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 14 మే 2023

5

అన్నమయ్య

'మిట్స్'లో జబర్దస్త్ నటుల సందడి

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ ఆక్స్-2023 రెండవ రోజు విద్యార్థులు ఫ్లాష్ మొబ్ డాన్స్ లతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఆనందంతో అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారని అన్నారు. శుక్రవారం సినిమా హీరో సత్యదేవ్ సందడి చేశారని, విద్యార్థులలో ఎక్స్ట్రాకల్చరల్ పోటీల లోను, స్పోర్ట్స్ లో ఉత్సాహాన్ని నింపుటకు నిర్వహణ చామన అన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రముఖ సింగర్స్ అరుణ్ కౌండిన్య, శృతిరంజని, శాండిల్యలు పాటలతో అలరించారు. జబర్దస్త్ అభినయశ్రీ ఆ వారి స్కిట్స్ తో, సినిమా డైలాగులతో ఆకట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాధ్, కె.శేఖర్ మెంబెర్, అకాడమిక్ కౌన్సిల్, ఎస్.ద్వారకనాథ్, కన్వీనర్ సమీనా, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదిరే అభి

సిపిఎస్ రద్దుపై ప్రభుత్వ వైఖరేంటో తేల్చాల్సిందే

యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల డిమాండ్

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, ఇప్పటికైనా సిపిఎస్ రద్దు పట్ల ప్రభుత్వం తమ వైఖరిని తేల్చాల్సిందేనని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. శనివారం యుటిఎఫ్ భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వారంలోపే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న అధికార పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఉలుకు పలుకూ లేకుండా ఉందన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అని ప్రకటించుకునే ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు విషయంలో మాట తప్పి, మడమ తిప్పి హామీ అమలు నుండి పారిపోయాడని విమర్శించారు. సిపిఎస్ రద్దుపై పోరాటం ఉధృతం అవుతున్న అనేక రాష్ట్రాలు సిపిఎస్ రద్దు చేస్తుంటే హామీ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు.సిపిఎస్ రద్దు పై హామీలు ఇచ్చి, అమలు చేస్తున్న అనేక పార్టీల ఆయా రాష్ట్రాలలో అధికారంలోకి వస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ విషయంపై మిగతా రాజకీయ పార్టీలు సైతం తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2004లో సిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చినప్పుడు వామపక్షాలు తప్ప మిగిలిన రాజకీయ పార్టీలన్నీ అనుకూలంగా ఓటు వేశాయని వారు గుర్తు చేశారు. 2004 నుంచి సిపిఎస్ కు వ్యతిరేకంగా పాత పెన్షన్ విధానం కావాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు, ఉద్యమాలు సాగిస్తూనే ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక దాని ఊసెత్తకపోవడం, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా కాకుండా రాజకీయ పార్టీలు సిపిఎస్ రద్దుపై నిర్దిష్టంగా అభిప్రాయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సిపిఎస్ రద్దు కోసం పోరాటాలు ఉధృతమైన నేపథ్యంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్నట్లు కొన్ని రాష్ట్రాలు ప్రకటించి, ఉత్తర్వులు విడుదల చేశాయని వారు పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానంలోకి వెళ్లే ఎన్ఎస్ఎల్లోని సొమ్ము తిరిగి రాదని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. 2013 లో చట్టం అయిన పిఎఫ్ఆర్డిఎను రద్దు చేయడం ద్వారా మాత్రమే సిపిఎస్ రద్దు సాధ్యమని వారు స్పష్టం చేశారు. పెన్షన్ ఇవ్వడం వల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలం అవుతుందనే గోబెల్ ప్రచారంపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.కొత్త పెన్షన్ విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి నష్టమని, కార్పొరేట్లకు మాత్రమే లాభమని గణాంకాలు చెప్తున్నా సిపిఎస్ను ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యోగుల రిటైర్మెంట్ తరువాత సదుపాయాలు షేర్ మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేయడం దుర్మార్గమైన చర్య అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు కోసం చేస్తున్న ఉద్యమాలపై ప్రభుత్వం నిర్బంధాలు విధించడం, అక్రమ కేసులు పెట్టడం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వానికున్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. సిపిఎస్ రద్దయ్యే వరకు, పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు తమ పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలన్నీ సిపిఎస్ రద్దుపై తక్షణమే తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ ఎస్.దావుద్దీన్, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ ప్రభాకర్, కడప నగర ప్రధాన కార్యదర్శి కరీముల్లా, జిల్లా కౌన్సిల్ సభ్యులు జి.వెంకటసుబ్బయ్య, సుజిత్, శివశంకర్ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అభివృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అన్నమయ్య జిల్లాలో ఏకైక పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటీగా విరాజిల్లుతున్న హార్సిలీహిల్స్ లో సాహస క్రీడలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ గిరిష ఆదేశించారు. శనివారం ఆయన హార్సిలీహిల్స్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ లో సాహస క్రీడలు ఏర్పాటుకు అనువుగా ఉందా లేదా అని నిపుణులతో కలిసి పరిశీలించారు. ఎటివి వెహికల్స్, ర్యాప్లింగ్, పర్యాటకుల కోసం ట్రెక్కింగ్ తదితర కార్యక్రమాలను చేపట్టేందుకు కార్యాచరణ చేయాలని అధికారులను ఆదేశించారు. హార్సిలీహిల్స్ మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొండకు వచ్చే పర్యాటకులు విడిది చేయడానికి వీలుగా అనువైన సౌకర్యాలతో పాటు, చిన్న పిల్లలు ఆడుకునేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రధానంగా ఇక్కడికి వచ్చే అతిథులకు అందించే సౌకర్యాలు, సేవలు సందర్శకులను ఆకట్టుకునేలా మరింత అభివృద్ధి చేయాలని తద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచాలన్నారు.దేశ నలుమూలల నుండి పర్యాటకులు హార్సిలీహిల్స్‌కు విచ్చేసి ఇక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తారన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఇక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. కలెక్టరుతోపాటు మదనపల్లి ఆర్డిఓ మురళీ, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ లో అభివృద్ధి పనులు చేపట్టే ప్రాంతాన్నపరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

రాజీమార్గమే రాచమార్గం : సివిల్ జడ్జి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్

ప్రజాశక్తి-పీలేరు

కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాచమార్గమని పీలేరు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం కోర్టు ఆవరణంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజలు క్షణికావేశంలో చేసే పొరపాట్ల కారణంగా పరిస్థితి పోలీసు కేసుల వరకు దారి తీస్తుందని తెలిపారు. అయితే కాస్త సంయమనం పాటించి, సహనంతో ఉంటే కేసులకు దూరంగా ఉండి స్నేహపూర్వక వాతావరణంలో జీవనం సాగించవచ్చన్నారు. ప్రజలు కక్షలకు, కార్పణ్యాలకు తావివ్వకుండా కలిసి, మెలిసి బతకడంలోనే ఎంతో ఆనందం ఉందని సూచించారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసుల్లో కక్షి దారులు తిరిగి కోర్టును ఆశ్రయించడానికి అవకాశం ఉండదన్నారు. అనంతరం జరిగిన లోక్ అదాలత్ లో సీనియర్ సివిల్ జడ్జి పలు కేసులు పరిష్కరించారు. ఈ సమావేశంలో పీలేరు ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శారద, సిఐ మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎండి రఫీ అన్సారి, లోక్ అదాలత్ సభ్యులు రాజేంద్ర బాబు, ఇతర న్యాయవాదులు, కక్షి దారులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని రేగళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం కోర్టు ఆవరణంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి, పలువురికి ప్రాథమిక వైద్య సేవలు అందించింది. టిబి సూపర్వైజర్లు మోహన్, పవన్ కుమార్, సిహెచ్ఓలు సుస్మిత, చంద్రలేఖ, ఆశ కార్యకర్తలు శ్రీదేవి, సుమలత, రేణుక, వీరకుమారి పాల్గొన్నారు.

కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

- మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిఒ-1పై హైకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు అన్నారు. జగన్ పాలన బ్రిటీష్ వారిని తలదన్నేలా ఉందని, అసమర్థ ప్రభుత్వ డొల్లతనాన్ని కప్పిపుచ్చుకునేందుకే జిఒ-1 తీసుకువచ్చారని విమర్శించారు. శనివారం జిఒ-1 రద్దు నేపథ్యంలో టిడిపి కార్యాలయం వద్ద నాయకులు కేకుకట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగాబత్యాల మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబును అడ్డుకునేందుకు, వాళ్ల సభలు, సమావేశాలు, రోడ్ షోలు, ర్యాలీలు, పాదయాత్రను, ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను అడ్డుకునేందుకే జగన్ ఈ జిఒను తీసుకొచ్చారని పేర్కొన్నారు. జగన్‌తో సహా వైసిపి నాయకులు పాల్పడ్డ అనేక ఉల్లంఘనలకు సంబంధించిన ఘటనలను వివరించారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా స్వేచ్ఛగా 3,648 కిలోమీటర్లు, 341 రోజులు పాదయాత్ర చేస్తే చంద్రబాబు ప్రభుత్వం పూర్తి భద్రత కల్పించిందని గుర్తు చేశారు. అతని నియంతృత్వ ధోరణికి అద్దం పడుతున్న జిఒ-1ని హైకోర్టు రద్దు చేసి మరోసారి మొట్టికాయలు వేసిందన్నారు. ఇప్పటికైనా అడ్డగోలు జిఒలు, అసంబద్ధ నిర్ణయాలు మానుకొని ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, టీ ఎన్ ఎస్ ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, భువనగిరిపల్లె తిరుపాలు పాల్గొన్నారు. **రాయచోటి :** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అక్కసుతో కక్షపూరితంగా ప్రవేశపెట్టిన చీకటి జిఒ నెంబర్-1 హైకోర్టు రద్దు చేయడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన అక్రమాలను చంద్రబాబు నాయుడు తన రోడ్ షోలో బహిరంగ సభల్లో బయటపెడుతున్నాడనే భయంతో జగన్ వెన్నులో వణుకు మొదలైందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మాజీ జడ్‌టిసి సభ్యుడు నరసారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, టిడిపి నియోజకవర్గ టిడిపి మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు నాగవేణి, పాల్గొన్నారు.

పొత్తులపై పవన్ మాట్లాడితే వైసిపికి వణుకు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పొత్తులపై పవన్ కళ్యాణ్ మాట్లాడితే వైసిపి వాళ్లకు తడిచిపోతున్నాయని జనసేన రాయల దక్షిణ కోస్తా సంయుక్త పార్లమెంటరీ సమన్వయకర్త మైఫోర్స్ మహేష్ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన వైసిపి అనే దారిద్ర్యాన్ని ఇంటికి పంపడానికి కళ్యాణ్ కంకణం కట్టుకున్నారన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పవన్ ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు కలిసి పోటీ చేస్తాయనే విషయాన్ని స్పష్టంగా పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో దిక్కు తోచని వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేల చేత మాట్లడిస్తోందన్నారు. పొత్తులపై పవన్ మాట్లాడితే మంత్రులు రోజా, అమరనాథ్, అంబటి ఏదో మాట్లాడి సిఎం జగన్మోహన్‌రెడ్డి మెప్పు కోసం ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మల్లిక, శోబ, సునీత, గంగాదర్, శ్రీనాథ్, నాగేంద్ర, నరేష్, సోను, హర్ష, నికేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మై ఫోర్స్ మహేష్

హాకీ ఆడుతున్న క్రీడాకారులు

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

- జాతీయ హాకీ క్రీడాకారుడు శుభన్ భాస్కర్

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి పట్టణంలోని రాజు ఒలంపియాడ్ స్కూల్ మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న జనార్దన్ రెడ్డి మెమోరియల్ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌కు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌లో అత్యుత్తమ స్థాయిలో రాణిస్తున్న ఉమ్మడి కడప జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి కావలసిన శిక్షణ, సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ లో అత్యుత్తమ క్రీడా ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు. శనివారం రెండవ రోజు ఆసక్తికరంగా పోటాపోటీగా జరిగిన హాకీ మ్యాచ్‌లలో బాలుర విభాగంలో సెమి ఫైనల్‌కు అనకాపల్లికి చెందిన నక్కపల్లి టీం, అన్నమయ్య జిల్లా రాజు హాకీ అకాడమీ, రాయచోటి హాకీ అకాడమీ జట్లు వచ్చాయి. బాలికల విభాగంలో అనకాపల్లికి చెందిన నక్కపల్లి జట్టు, కడప జట్టు, అన్నమయ్య జిల్లాకు చెందిన రాజు అకాడమీ జట్లు సెమీఫైనల్ కు చేరుకున్నాయి. కార్యక్రమంలో సిఐ చంద్రశేఖర్, జిల్లా హాకి అసోసియేషన్ సెక్రటరీ నాగేశ్వరరావు, కోశాధికారి ఖదీరుల్లాఖాన్, సభ్యులు సుబ్బయ్య, సునీల్, మహేశ్వర్ రాజు, రెడ్డి శేఖర్‌రాజు, శివప్రసాద్ నాయుడు, వెంకటకృష్ణమ నాయుడు, పీటర్ దాస్, మైనుద్దీన్, లక్ష్మిరెడ్డి, బాలరాజు, అంజి, హాకి కోచ్‌లు వెంకట్, సుబ్రహ్మణ్యం, నారాయణ, హాజిత, వివిధ జిల్లాల హాకీ మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

బిసిల సత్తా చాటుదాం : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్ పాలనలో అణచివేతకు గురైంది, అత్యంత తీవ్రంగా నష్టపోయింది బిసిలేనని రాజంపేట పార్లమెంట్ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. శనివారం తిరుపతి రోడ్డులోని దేవత నగర్ రాజంపేట పార్లమెంట్ కార్యాలయంలో రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర, పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాజంపేట పార్లమెంటు పరిధిలోని బిసి సాధికార కమిటీ నియోజకవర్గ, మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎంతో మహోన్నత లక్ష్యం కలిగిన సబ్ ప్లాన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, బిసిల కోసం ఖర్చు చేయాల్సిన రూ.5 వేల కోట్లను దారి మళ్లించి ఆర్థికంగా అణగదొక్కారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కూడా రాణించాలి,రాజకీయంగా ఎదగాలనే లక్ష్యంతో ఆనాడు దివంగత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు కల్పించిన 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి 16,800 పదవులను బీసీలకు దూరం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో అబ్జర్వర్ అరవింద్ బాబు, ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప,కురబ సాధికార సమితి పార్లమెంట్ కన్వీనర్ జనార్దన్, బోయ సాధికార సమితి కన్వీనర్ లక్షమన్న,రజక సాధికార సమితి కన్వీనర్ జ్ఞానమూర్తి,వడ్డెర సాధికార సమితి కన్వీనర్ నారాయణ, తొగట సాధికార సమితి కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు రాగి జావ పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి ప్రభుత్వ చిల్డ్రస్ హోంలో అనాథ బాలలకు (ఆర్గానిక్) చిరుధాన్యాలు ఊదర్లతో తయారు చేసిన రాగి జావను శనివారం పంపిణీ చేశారు. వైడ్స్ స్వఛరేద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు బరినేపల్లి మాధవి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలైన సామలు, కొర్రలు, అరికలు, వరిగలు, అండు కొర్రలు, సజ్జలు, రాగులు, జొన్నలు, ఊదర్లతో వైర్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా తయారు చేసిన జావాను నెల రోజుల పాటు పిల్లలకు పంపిణికి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ వ్యాయామం చేయడం, సంతోషంగా ఉండాలని పేర్కొన్నారు. అప్పేడే సంపూర్ణ ఆరోగ్యం చేకూరి సర్వరోగాలను కంట్రోల్ చేయవచ్చన్నారు. విద్యార్థులు తమ ఆరోగ్యాలను ఇప్పటి నుంచే కాపాడుకోవాలన్నారు. అనంతరం షుగర్ పరీక్షలను చిల్డ్రన్స్ హోమ్ సిబ్బందికి నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిల్డ్రన్స్ హెూమ్ సూపరిండెంట్ ఉమారాణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ఇద్దరు చిన్నారులు మృతి - పార్నపల్లెలో విషాద ఛాయలు

ప్రజాశక్తి-లింగాల

సరదా కోసం ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా ఎల్లనూరు సింగవరం సమీపంలోని చిత్రావతి రిజర్వాయర్ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన షాకే గంగాదేవి, రవీంద్రబాబు కుమారుడు చరణ్ కుమార్ (13), ముక్తాపురం అంజనమ్మ, పేతురు కుమారుడు కుశ్వంత్(8) ఇద్దరు విద్యార్థులు సింగవరం గ్రామంలో బంధువుల గృహప్రవేశానికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లారు. చిత్రావతి రిజర్వాయర్ కుడి కాలువ వద్దకు ఈతకు వెళ్లారు. అక్కడ వారికి సరిగ్గా ఈత రాకపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరు చిన్నారులు అక్కచెల్లెళ్ల పిల్లలు కావడంతో ఆ కుటుంబం, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాలను అందజేశారు.

మృతి చెందిన చరణ్‌కుమార్

మృతి చెందిన కుశ్వంత్

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-రాయచోటి

సమాజంలో రక్తదానం చేయడం ఇతరులకు ప్రాణదానం చేసినట్లు అని నియోజకవర్గం యువ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం సంబేపల్లి మండలం నారాయణ రెడ్డి పల్లెలో శనివారం కీర్తిశేషులు గొల్లిండ్ల శ్రీనాథ్ జ్ఞాపకార్థం అజయ్ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పలు రకాల ఇంత వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో చాలామందికి రక్తం అవసరం ఏర్పడుతుందన్నారు. అలాంటి సమయంలో యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం వల్ల ఆ రక్తం ఇతరులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని ఎలాంటి అపోహలకు తావు లేకుండా యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయడం శ్రేయస్కరమని పేర్కొన్నారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అశోక్, బాల, సురేందర్ రెడ్డి, కొండారెడ్డి, అజయ్, ఓం ప్రకాష్, మరి కొందరు రక్తదానం చేశారు. దీప బ్లడ్ బ్యాంక్ దాతల నుంచి రక్తాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సయ్యద్ అహ్మద్, బిందు రెడ్డి, శంకర్ రెడ్డి, సుదర్శన్, రవీంద్ర నాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, నరేంద్ర, నరేష్, కాంట్రాక్టర్ ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి మదన, మాజీ సర్పంచులు వెంకట్రాంరెడ్డి, రంగస్వామి, కొండారెడ్డిరాజు, సురేందర్ రెడ్డి ఆంజనేయులురెడ్డి పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా ఆదివారం రాయచోటి నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ నుంచి ఠానా, చెక్ పోస్ట్, కొత్తపేట రోడ్డు, బస్టాండ్, బంగ్లా వరకు పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 16వ తేదీ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాజధాని కళ్యాణ మండపంలో మినీ మహానాడు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

'గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి'

ప్రజాశక్తి-కురబలకోట

జగనన్న కాలనీలలో లబ్దిదారులందరూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని కలెక్టర్ గిరీష అన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా, కురబలకోట మండలం, కంటేవారిపల్లి జగనన్న కాలనీ లేవుట్‌లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కంటేవారిపల్లి జగనన్న కాలనీ లే అవుట్‌లో మొత్తం ఎన్ని ప్లాట్లు, ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు? వంటి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలో లబ్దిదారులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. లబ్దిదారులందరని స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేర్చి ప్రభుత్వం తరపున సాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టాలు పొందిన ప్రతి ఒక్కరూ త్వరగా ఇళ్ల నిర్మాణం చేపట్టుకోవాలని లబ్ధిదారులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్‌తో పాటు మదనపల్లి ఆర్డీఓ మురళి, ఎంపిడిఒ దిలీప్ కుమార్, తహశీల్దార్ భీమేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, విద్యుత్ ఎఇ వెంకటరత్నం, శాఖల అధికారులు,హౌసింగ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణకు విశేష స్పందన

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మదనపల్లి శాఖా గ్రంథాలయంలో జరుగుచున్న వేసవి శిక్షణా శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని గ్రంథాలయ అధికారిణి వసంత కుమారి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం వేసవి సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు శిబిరంలో యోగా, మెడిటేషన్ విజయలక్ష్మీ,స్పోకెన్ ఇంగ్లిష్ రెడ్డెప్ప,మానవతా విలువలు మదన్ మోహన్,మోటివేషన్ నడ్డి నారాయణ, భగవద్గీత రమణమ్మ శిక్షణను ఇచ్చారు. న్యూట్రిషన్ గురించి చంద్రకళ పిల్లలకు నేర్పించారు.ప్రతిరోజు పలు అంశాలపై విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున మదనపల్లి పట్టణంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు.మరిన్ని వివరాలకు గొల్లపల్లి రింగ్ రోడ్డులోని శాఖ గ్రంథాలయ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ లోకవర్ధన్

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలోని గ్యారంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలో ఎన్‌సిడి, సిడి సర్వేలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. పిహెచ్‌సి పరిధిలోని జనాభాలో సర్వే 90 శాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఉదయ్‌కిరణ్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని ఒకటవ సచివాలయం పరిధిలోని జయశ్రీ కాలనీలో శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ చొరవతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని ప్రజలు మాట్లాడుతూ గతంలో వేసిన వీధి దీపాలు వెలగక పోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడే వారమన్నారు. వెంటనే స్పందించి ఎమ్మెల్యే చొరవతో కొత్త విద్యుత్ దీపాలనువేయించి సమస్యను పరిష్కరించారని అన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన పాగొండఖలీల్, చాంద్‌బాషా, తమ్మిగుంజల జనార్దన్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసిన సిబ్బంది

ఎస్‌టి గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండల కేంద్రంలోని గిరిజన గురుకులంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కన్నయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో మూడవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడవ తరగతిలో 40 మంది, నాలుగులో 40 మంది, ఐదులో 37 మంది, ఆరులో 28 మంది, ఏడులో 21 మంది, 8లో 27 మంది, తొమ్మిదిలో 19 ఖాళీలు ఉన్నాయని అర్హులైన విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల ఎంపిక లాటరీ పద్ధతిలో ఉంటుందని, అదేవిధంగా బ్యాక్ లాక్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన చెప్పారు.

నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని సుద్దమల్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ [illegible] శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం గణపతిపూజ స్వస్తి వాచనం, కల్యాణం, ఆంజనేయ మూలమంత్ర జపం, పంచామృతాభిషేకం నిర్వహిస్తారని చెప్పారు.

పాదయాత్రకు సంఘీభావం తెలపండి

ప్రజాశక్తి-ములకలచెరువు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావం తెలపాలని టిడిపి మండలాధ్యక్షులు పాలగిరి సిద్ద పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో యువగళం పాదయాత్రకు సంఘీభావంగా మండలంలోని టిడిపి కళ్యాణ మండపం నుంచి మదనపల్లి రోడ్డులోని పెట్రోల్ బంక్ వరకు పాదయాత్ర చేపట్టి సంఘీభావం తెలపాలన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ ఇంఛార్జిలు, మాజీ సర్పంచ్, మాజీ జడ్‌పిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు, నియోజక వర్గం తెలుగు యువత కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు, మైనార్టీ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, సాధికార కమిటీ సభ్యులు, ఇతర అనుబంధ కమిటీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు.

వాలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ములకలచెరువు

నియోజకవర్గంలో వాలంటీర్లు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక సిఎల్‌ఆర్‌సి భవనంలో మండలంలోని వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషించాలన్నారు. గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు సచివాలయ అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించాలన్నారు. మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తే వాలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మాధవరెడ్డి, జడ్‌పిటిసి మోహన్‌రెడ్డి, ఎంపిపి సాయిలీలా, సింగిల్ విండో ఛైర్మన్ గౌరీశంకర్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్ రెడ్డి, సర్పంచులు రమ్యశ్రీ, రాంబాబు, రెడ్డెప్ప, మాజీ సర్పంచి రవీంద్రారెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చాంద్‌బాషా, సుదర్శన్‌రెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కంటి వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరూ కంటి వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉంటే తమ చూపును పదిలంగా భద్రపరచుకోవచ్చని కంటి వైద్యుడు యం.ఎస్.తేజ అన్నారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి) సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శనివారం సెక్రటేరియట్ సభ్యులు రాజేష్ ఆధ్వర్యంలో పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వానికి గల కారణాలను, దృష్టి లోపాలపై అవగాహన కల్పించారు. పాలకూర, క్యారెట్, బీట్‌రూట్, చేపలు, విటమిన్ ఎ, బీన్స్, గింజలు, గుడ్లు, నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లలో కళ్లకు శక్తినిచ్చే విటమిన్ ఎ, సి, ఇ ఉంటాయన్నారు. అవి సరిపైన కళ్లజోడు ధరించాలని, ప్రతిరోజు 8గంటల నిద్ర అవసరమన్నారు. ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, డాక్టర్ చక్రధర్, ప్రధాన కార్యదర్శి సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు అండగా ఉంటాం

కడప: పదవ తరగతి ఫలితాల్లో వికాస్ హైస్కూల్ విద్యార్థిని బి.లక్ష్మి చేతన 600 మార్కులకు 596 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండవ ర్యాంక్, జిల్లాలో మొదటి ర్యాంక్ దక్కించుకున్న సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనను వికాస్ స్కూల్ కరస్పాండెంట్ హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివేందుకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

జగన్‌ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదు

కడప: పవన్ కళ్యాణ్‌కి ప్యాకేజీ ఇంకా ఎంత అనేది క్లారిటీ వచ్చినట్లు లేదని, ఆయన తీరు జనసేన కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తుందని చింత కొమ్మదిన్నె జెడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌పై మండిపడ్డారు. రోజుకో మాట, గంటకో మాట, నిమిషానికి ఒకలా పవన్ కళ్యాణ్ ప్రవర్తిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించే స్థాయి పవన్ కళ్యాణ్‌కు లేదని చెప్పారు.

ప్రగతి పథంలో ఆదర్శ పాఠశాల



పిఎంశ్రీ పథకానికి ఎంపికైన కెవిపల్లి ఆదర్శ పాఠశాల

ప్రజాశక్తి-పీలేరు

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల పిఎంశ్రీ పథకానికి ఎంపిక కావడంతో మరింత ప్రగతిని సాగేందుకు అవకాశం కలిగింది. ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి కెవిపల్లి ఆదర్శ పాఠశాల ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.రెడ్డిప్రదీప్ తెలిపారు. ఈ పథకం ద్వారా పాఠశాలలకే నేరుగా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాను న్నాయన్నారు. దేశంలోని పాఠశాలల ప్రధానో పాధ్యా యుల నుంచి మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూడు సార్లు పరీక్షలు నిర్వహించి, ఆంధ్రప్రదేశ్లో 662 పాఠ శాల లను ఈ పథకం కింద ఎంపిక చేశారని చెప్పారు. జిల్లాలోనూ 28 పాఠశాలలు ఎంపిక కాగా, అందులో కెవిపల్లి ఏపి ఆదర్శ పాఠశాల కూడా ఉందని అన్నారు. ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్రం సంకల్పించిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాఠశాలకు ప్రతి సంవత్సరం దాదాపు రూ.30లక్షలు చొప్పున ఐదు సంవత్సరాల పాటు సాయం అందనున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. మంజూరయ్యే నిధులతో డిజిటల్ తరగతుల ఏర్పాటు, ఉపాధ్యాయ అభ్యసనా సామగ్రి, గ్రంథాలయం, తరగతి గదుల నిర్మాణం, క్రీడా మైదానాల అభివృద్ధి, అవసరమైన పరికరాలు, గ్రీన్ స్కూల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వంటి వాటికి ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు.

2013లో ప్రారంభమైన ఈ ఆదర్శ పాఠశాల పేరుకు తగ్గట్టుగా వనరులను సమకూర్చుకుని ఫలితాలలో కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నిలుస్తొందని అన్నారు. ప్రతి సంవత్సరం పదవతరగతి, ఇంటర్మీడియట్‌లో అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ, కెవి పల్లి మండలంతో పాటు ఇతర మండలాల నుంచి కూడా విద్యార్థులను విపరీతంగా ఆకట్టుకుని అడ్మిషన్లకు పోటీ నెలకుంటోందని అన్నారు. ఈ పాఠశాలలో ఆరవ తరగతిలో చేరిన విద్యార్థి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉందని, ఇంటర్మీడియట్లో ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపు లున్నాయని, ప్రతి గ్రూపుకూ 40 మంది చొప్పున ఆంగ్ల మాధ్యమంలో చదువు కోవడానికి వీలుందని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవే శానికి నోటిఫికేషన్ విడుదలైందని ప్రిన్సిపల్ తెలిపారు.

పాఠశాల ప్రిన్సిపల్ రెడ్డిప్రదీప్

అవినీతి పాలనను సాగనంపుదాం : ఆర్ఆర్

గాలివీడు : ఇదేంఖర్మ కార్యక్రమంలో రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

అవినీతిమయమైన వైసిపి పాలనను త్వరగా సాగనంపుదామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గాలివీడు పంచాయతీలో నిర్వహించిన బాదుడే బాదుడు, రచ్చబండ, ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అసమర్ధ విధానాలతో రాష్ట్రంలో పారిశ్రామికతలు పెట్టుబడులు పెట్టాలంటేనే భయపడుతున్నారని అన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగులందరూ ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళుతున్నారని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని నలమూలల పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించామని పేర్కొన్నారు. వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికి వెళ్లిప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రజల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు, మాజీ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, చిన్నపరెడ్డి, ప్రభాకర్ నాయుడు, మాజీ వక్ఫ్ బోర్డ్ మెంబర్ మహబూబ్ బాషా, మండల టిడిపి ఉపాధ్యక్షుడు శివపనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి జక్రియ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. **వీరబల్లి :** రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో సాగనంపి ప్రజా ప్రభుత్వమై టిడిపిని అధికారంలోకి తెచ్చుకుందామని టిడిపి మండలాధ్యక్షుడు భానుగోపాల్‌రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని తాటి గుంటపల్లె గ్రామ పంచాయితీలోని ఉప్పరపల్లె, షికారుపాలెంలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వ హించారు. ప్రతి ఇంటికి తిరిగి వైసిపి ప్రభుత్వ అవినీతి, అక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రదాన కార్యదర్శి తోళ్లసురేంద్ర, మాజీ సర్పంచ్ వెంకట్రామరాజు ఆంజినే యరెడ్డి, బాస్కర్‌రాజు, ప్రభాకర్ నాయిడు, మాజీ సర్పంచ్ మండల ఉపాధ్యక్షుడు దుర్గం ఆంజినేయులు, బూత్ కన్వీనర్ వి.మహేష్, బాల రాజు, మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, టిఎన్ఎస్ఎఫ్ నేతిరమేష్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు

ప్రజాశక్తి-రాయచోటి

కర్ణాటకలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లాబకాష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఆనందోత్సాహాల నడుమ సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మార్పు మొదల్కెందని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, దేశ సుస్థిరాభివృద్ధికి పాటు పడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ప్రజలు విశ్వసిస్తున్నారని ఆ పార్టీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఎపిసిసి మైనార్టీ వైస్ చైర్మన్ ఎస్ మహమ్మద్ రఫీ, ఎఐసిసి మాజీ సభ్యులు అజంతుల్లా, జిల్లా ఆర్‌టిఐ చైర్మన్ అమీర్‌బాషా, జిల్లా కిసాన్ సెల్అధ్యక్షుడు చెన్న కృష్ణ, మండల మైనార్టీ అధ్యక్షులు అక్బర్ అలీ, పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ లీడర్ ముబారక్, ఎస్ఎండి ఇర్షాద్ తారక్ దినకర్, ఖదీర్ ,ఎస్ రఫీ ,ఖాదర్ వలీ, మన్సూర్ పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** పట్టణంలో డిసిసి మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పటకాలు కాల్చి స్వీట్లు పంచుకన్నారుకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి ఎస్.అల్లాబకాష్, పట్టణ అధ్యక్షుడు ధర్బార్ బాషా, జిల్లా మైనార్టీ సెక్రెటరీ యహియాబాషా, మన్సూర్ విక్టోరియాన్, జాకీర్‌బాషా, జిలానిబాషా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పీలేరు:** కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల పీలేరులో కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సాయిసంపత్ కుమార్, యూసుప్ పాల్గొన్నారు. **కలికిరి :** కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ఆనందోత్సవాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. డిసిసి మాజీ కార్యదర్శి శ్రీవర్ధన్‌చౌదరి, ఒబిసి జిల్లా కాంగ్రెస్ చైర్మన్ బిఆర్.మల్లికార్జునల ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు కలికిరి క్రాస్ రోడ్లు స్వీట్లు పంచుకుని, టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. **మదనపల్లె అర్బన్ :** కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీతో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం అద్వితీయమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్ హర్షం వ్యక్తం చేశారు. దేశప్రజలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఎంత అసంతృప్తితో ఉన్నారో అనేదానికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ మీనాకుమారి, మహమ్మద్‌అలీ, మహబూబ్ పీర్, నూర్ అహ్మద్, రఫీ పాల్గొన్నారు.

రాయచోటి : కాంగ్రెస్ విజయంతో తీపి తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

530 కేసులకు శాశ్వత పరిష్కారం : జడ్జి

నందలూరు : లోక్‌అదాలత్ లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి కె.లత

ప్రజాశక్తి-నందలూరు

స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 530 కేసులు రాజీ మార్గమున శాశ్వతంగా పరిష్కరించినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, న్యాయమూర్తి కె.లత తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులలో రూ.12.5లక్షలు, క్రిమినల్ కేసులలో రూ.7.30 లక్షలు, రూపాయలు పరిష్కరించి ఫిర్యాదుదారులకు అందజేయడం జరిగిందని, ఇతర క్రిమినల్ కేసులలో రూ.2.30లక్షలు ప్రభుత్వానికి జమ చేయడం జరిగిందని న్యాయమూర్తి కే.లత తెలిపారు. పిఎల్‌సి కేసులలో రూ.6.55 లక్షలు పరిష్కరించినట్లు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ లోన్ కేసులలో రూ.2.93 లక్షలకు గాను తగ్గించి మూడు కేసులు పరిష్కరించి అందులో ఒక కేసులో రూ.45 వేలు, రెండవ కేసులో రూ.1.36లక్షలు, రూ.1.12లక్షలు తగ్గించి కేసులు పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేయడం జరిగిందన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా కేసులు శాశ్వతంగా పరిష్కరించుకోవడమే కాకుండా వారికి తగిన న్యాయం కూడా అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట పోలీస్ అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు సిబ్బంది, పిఎల్‌విలు పాల్గొన్నారు.

37 కేసులు రాజీ

కలికిరి: శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 37 కేసులను రాజీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం వాయల్పాడు కోర్టులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని 7 ఐపిసి కేసులు, 26 పెట్టి కేసులు, 4 లోకల్ కేసులతో కలిపి 37 కేసులను రాజీ చేసినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి లోక అదాలత్ కార్యక్రమాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అమ్మను మించిన దైవమున్నదా'

- నేడు మాతృమూర్తి దినోత్సవం

ప్రొద్దుటూరు : క్షమాగుణంలోనూ, సేవాగుణంలోనూ అమ్మకు సాటిగా నిలిచే వ్యక్తి ఈ భూమ్మీద ఎవరూ ఉండరు. అమ్మకు అమ్మేసాటి. బాల్యంలో తెలియక చేసే తప్పులను క్షమించి అక్కున చేర్చుకుంటుంది. యవ్వనంలో మిడిమిడి జ్ఞానంతో చేసే పొరపాట్లను శాంతంగా నచ్చచెబుతుంది. వయసొచ్చాక తప్పులు చేస్తే నవ్వి మార్చమని భగవంతుడిని వేడుకుంటుంది. అందుకే అమృతం ఎలా ఉంటుందో తెలియదు.. కాని అమ్మప్రేమ అంతకన్న తియ్యనైం దటారు. భగవంతుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మను సృష్టించాడంటాడో కవి. ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం మాతృమూర్తి దినోత్సవం జరుగుకుంటున్నాం. అమ్మసేవలన గుర్తు చేసుకోవడం కోసం ఒక రోజంటూ ఏర్పడడం నిజంగా హర్షించతగ్గ విషయం. అదే సమయంలో దీన్ని ఒకరోజుకే పరిమితి చేయడం సమంజసం కాదు. స్త్రీలకు అంతటా సమప్రాధాన్యం దక్కిన రోజు హింస నుండి వారిని విముక్తి చేయబడ్డరోజు, భ్రూణహత్యల బారినుండి ఆడ శిశువులను రక్షించిన రోజు ప్రపంచానికి మరింత మంది గొప్ప అమ్మలను అందించగలం. ముఖ్యంగా పితృస్వామ్య భావజాలాన్ని విడనాడి స్త్రీ, పురుష సమానత్వం సాధించిన రోజు అమ్మలకు నిజమైన గౌరవాన్ని ఇచ్చినట్లు. అమ్మ ప్రేమకు కొలమానాలు లేవు. అమ్మప్రేమను వివరించేందుకు అక్షరాలూ లేవు. మనమీస్థాయిలో ఉండేందుకు కారణమైన అమ్మను ఎంత ప్రేమగా చూసుకున్నా తక్కువే. అమ్మప్రేమను సమాజానికంతటికీ అందిద్దాం. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు వాసి తులసీభాగ్యలక్ష్మి మాటల్లోనే 'నాకు ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. చిన్నతనంలోనే అనారోగ్యంతో భర్తను కోల్పోయాను. అప్పట్లో ఈ నలుగురు సంతానం, పేదరికం తప్ప నావద్ద ఏమీలేవు. పంటి బిగువున కష్టాలను దాచిపెట్టి ఆడబిడ్డలకు వివాహాలు చేశాను. అనారోగ్యంతో మృత్యువు అంచువరకు వెళ్లిన మా అబ్బాయిని దక్కించుకొని ప్రయోజకుణ్ని చేశాను. ఏమైనా చేసి అమ్మ పిల్లల్ని సాకుతుంది. పిల్లల కోసం ప్రాణం సైతం లెక్కచేయదు. తల్లిదండ్రులు పిల్లలకు తరగని ఆస్తి. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ భారం కాదు బాధ్యత'గా భావించాలని అన్నారు.

సదాశివరాయలు కాలంనాటి బావి గుర్తింపు

ప్రజాశక్తి-చాపాడు

మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె ఎర్ర చెరువుకు సమీపంలోని పుట్టక కనుమ దిగువ భాగం పడమర వైపున సదాశివరాయలు కాలం నాటి బావిని గుర్తించినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ శనివారం విలేకరులకు తెలిపారు. తిప్పిరెడ్డిపల్లె ఎర్ర చెరువు గుండా ఒకటిన్నర మైలు దూరం ప్రయాణించి ఈ బావిని కనుగొన్నట్లు తెలిపారు. పెద్దవంక, ఆ వంకకు ఒక పిల్ల వంక కలిసే ప్రాంతానికి పడమర వైపు ఈ బావి ఉందని.. ఆ బావికి వీర్ల బాడవ బావి పేరు అని వివరించారు. వీర్ల బాడవ బావికి పడమర వైపు అత్యంత సుందరమైన పార్వతిదేవి విగ్రహం ఉండేదని, గతంలో ఆ విగ్రహాన్ని చూసిన తిప్పిరెడ్డిపల్లె వాసి నడిపి వెంకటయ్య తనకు చెప్పారని రమేష్ తెలిపారు

డివైడర్‌ను శుభ్రం చేస్తున్న ఆర్అండ్‌బి సిబ్బంది

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణ పరిధిలోని గేటు నుంచి బస్టాండ్ వరకు ఉన్న డివైడర్ల మధ్యలో మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్అండ్‌బి జెఇ గిరీష్ కుమార్‌రావు పేర్కొన్నారు. శనివారం డివైడర్ల మధ్యలో ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బంది చేత శుభ్రం చేయించారు. ప్రధాన రహదారిలో డివైడర్ల మధ్యలో వ్యర్థ పదార్థాలు వేయడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మూడు రోజుల్లో అన్ని చోట్ల చెత్తాచెదారాన్ని తొలగింపజేసి మొక్కలు నాటి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విరాళాన్ని అందిస్తున్న ముకుంద మునిశేఖర్‌రెడ్డి దంపతులు

సౌమ్యనాథ సేవా ట్రస్టుకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీ సౌమ్యనాథ సేవ ట్రస్ట్ నిత్య అన్నదానానికి శనివారం చంద్రగిరికి చెందిన ముకుంద మునిశేఖర్‌రెడ్డి, శ్యామల దంపతులు రూ.50 వేలు ట్రస్ట్ కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు అందించారు. ఈ సందర్భంగా చక్రాల రామసుబ్బన్న మాట్లాడుతూ ప్రతి శుక్ర, శని, ఆదివారాలలో అన్నదానం చేస్తున్నామని అన్నారు. త్వరలో నిత్యాన్నదానం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని చెప్పారు. అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమములో ట్రస్ట్ సభ్యులు లంకాయగారి సుబ్బరామయ్య, చక్రాల సాయినాథ్, వరదయ్య, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక గజ్జల చిన్న రంగారెడ్డి మెమోరియల్ ప్రైవేటు ఐటిఐలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సుబ్బారావు తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ ఐటిఐలో డీజల్ మెకానిక్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ కోర్సులు ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకరావేతనాలు, ఉచిత హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. అప్రెంటిస్ సౌకర్యం ఉందన్నారు. మూడు నెలలకు ఒకసారి వివిధ కంపెనీలచే జాబ్ మేళా నిర్వహించనున్నటు తెలిపారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

క్రైం కార్నర్

యువకుడిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ఆస్తికోసం ఓ యువకుడిపై ప్రత్యర్థులు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. శనివారం స్థానిక బికెపల్లిలో చోటుచేసుకున్న ఘటనపై పోలీసుల వివరాల మేరకు మదనపల్లి ప్యారానగర్‌లో నివాసముంటున్న జవహర్‌బాషా కుమారుడు రఫిక్ అహ్మద్(34) తండ్రికి వారసత్వంగా సంక్ర మించిన ఐదెకరాల వ్యవసాయ పొలం బికేపల్లి సర్వే నెంబర్ 536/2 లో ఉంద న్నారు. ఆ భూమిని అక్కడున్న హుస్సేన్ పీర్ ఆక్రమించాడని వెళ్లి అడ్డుకున్నారు. ఆగ్ర హించిన హుస్సేన్ పీర్ అతని కుమా రుడు అఖిల్ పీర్ కత్తులతో మూకుమ్మడిగా దాడి చేసి రఫిక్ అహ్మద్‌పై దాడిచేసి పొట్టలో పొడవడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. బాధితుడిని స్థానికులు హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనం తరం తిరుపతికి వెళ్లాలని వైద్యులు సూచించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కత్తిపోట్లకు గురైన రఫీక్

12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో రాయవరం సెక్షన్ రోళ్లమడుగు వద్ద 12 ఎర్రచందనం దుంగలతో పాటు ముగ్గురు స్మగ్లర్లను టాస్క్ పోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం టాస్క్ ఫోర్స్ డిఎస్‌పి చెంచుబాబు ఆదేశాల మేరకు ఆర్ఐలు సురేష్ కుమార్‌రెడ్డి, చిరంజీవులు టీమ్‌లు సానిపాయ, తిరుపతి బేస్ క్యాంపుల నుంచి కూంబింగ్ చేపట్టారు. ఆర్ఎస్ఐ రాఘవేంద్ర సానిపాయ నుంచి బయలుదేరి గొల్లపల్లి, మల్లిమడుగు పాయింట్లు తనిఖీ చేసుకుంటూ రాయవరం సెక్షన్ వానరాసిపల్లి ఫారెస్టు బీట్ వద్ద రోళ్లమడుగు మార్గంలో వెళుతుండగా, శనివారం తెల్లవారుజామున ఊటగుంట వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు.వారిని హెచ్చరించి చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు దుంగలను పడేసి పారిపోయారని అన్నారు. తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన భాగ్యరాజ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో పడేసిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి ఆచూకీ కోసం తిరుపతి బేస్ క్యాంపు అనుపల్లి వద్ద కూంబింగ్ చేస్తున్న ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందానికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. వీరు ఆ మార్గంలో తనిఖీలు చేస్తుండగా, ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిళ్లతో కనిపించారని, వారిని విచారించడంతో, ఊటగుంట నుంచి తప్పించు కున్నవారిగా గుర్తించినట్లు తెలిపారు. తమిళనాడు తిరువన్నామలై జిల్లా ఓంశివన్(32), చిత్తూరు జిల్లా ఇరువారంకు చెందిన మొయినుల్లా(40) కనుగొని అరెస్టు చేసి, వీరినుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన 12 ఎర్రచందనం విలువ రూ.10లక్షల వరకు ఉండవచ్చునని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఐ బి.మోహన్ నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టుబడిన నిందితులు, ఎర్రచందనం దుంగలతో పోలీసులు